క్లుప్తంగా

ఎరువుల దుకాణాల తనిఖీ



ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న ఏడీఏ

వెలుగోడు: ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయించే ఎరువుల డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏడీఏ ఆంజనేయులు హెచ్చరించారు. శుక్రవారం స్థానిక శ్రీనివాస ఆగ్రో కెమికల్స్, దుర్గ భవానీ ఫర్టిలైజర్స్, ప్రాథమిక పరపతి సహకార సంఘం, మన గ్రోమోర్, రైతు సేవా కేంద్రాన్ని ఏఓ పవన్‌కుమార్‌తో కలిసి ఏడీఏ తనిఖీ చేశారు. ఎరువులు, పురుగు మందుల రిజిస్టర్లు, రికార్డులు పరిశీలించి పలు సూచనలు చేశారు.

మృగాళ్లను కఠినంగా శిక్షించాలి



గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

నందికొట్కూరు: కోల్‌కత్తాలో జూనియర్ వైద్యురాలిపై అత్యాచారానికి పాల్పడి, హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఐద్వా, ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ సంఘాల నాయకులు షాజిదాబీ, హర్షవర్ధన్, బాబు డిమాండ్ చేశారు. వైద్యురాలిపై జరిగిన దారుణాన్నిఖండిస్తూ శుక్రవారం గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు.

పెళ్లిలో రక్తదాన శిబిరం



పెళ్లి మండపంలో రక్తదానం నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): మహానంది దేవస్థానంలో శుక్రవారం తమ్మడపల్లె గ్రామానికి చెందిన మహేష్, హేమలతల పెళ్లి వైభవంగా నిర్వహించారు. వరుడు మహేష్ వినూత్న ఆలోచనతో పెళ్లి మండపం ఆవరణలో రక్తదాన శిబిరం నిర్వహించి 20 మందితో రక్తదానం చేయించారు. రక్తదానంపై ప్రజల్లో చైతన్యవంతం చేసేందుకే రక్తదాన శిబిరాన్ని నిర్వహించినట్లు వరుడు మహేష్ తెలిపారు. సేకరించిన రక్తాన్ని నంద్యాల బ్లడ్ బ్యాంక్‌కు అందజేసినట్లు తెలిపారు.

వాహనాల తనిఖీ



వాహనాలు తనిఖీ చేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: మండలంలోని ఎం.లింగాపురం గ్రామ శివారులో ఏఎస్‌ఐ బాబాఫక్రుద్దీన్ తన సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనదారులు రోడ్డు నియమాలు పాటించాలని సూచించారు. లైసెన్స్ లేకుండా వాహనం నడపడం చట్టరీత్యా నేరమన్నారు. మైనర్లకు వాహనం ఇవ్వకూడదన్నారు. తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ శేషారాం సింగ్, సిబ్బంది హరినాథ్, అశ్వక్ ఉన్నారు.

తూతూ మంత్రంగా సభలు

పగిద్యాల/మిడుతూరు/పాములపాడు/కొత్తపల్లి: నందికొట్కూరు నియోజకవర్గంలోని గ్రామ సభలు శుక్రవారం తూతూమంత్రంగా సాగాయి. పగిడాలలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి, జిల్లా పట్టుపరిశ్రమ శాఖ అధికారిణి పరమేశ్వరి ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. ఎంపీడీఓ వెంకటరమణ, తహసీల్దార్ శివరాముడు తదితరులు పాల్గొన్నారు. మిడుతూరు గ్రామ సభకు ఎంపీడీఓ జీఎస్ఎస్‌రెడ్డి, నాగలూటి గ్రామ సభకు తహసీల్దార్ శ్రీనివాసులు హాజరయ్యారు. పాములపాడు అంగన్‌వాడీ భవనాలకు ప్రహరీ, తాగునీటి వసతి, సీసీ రోడ్డు, మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టాలని టీచర్లు కోరారు. కొత్తపల్లి మండలంలో జరిగిన గ్రామ సభల్లో ఎంపీడీఓ మేరి, జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి, ఎంపీపీ కిచ్చన్న గారి కుసుమలత తదితరులు పాల్గొన్నారు.

● శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంట గ్రామసచివాలయం–2లో నిర్వహించిన గ్రామసభలో స్పెషల్ ఆఫీసర్ శివప్రసాద్, ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీఓ ఎ.సురేష్‌కుమార్, తహసీల్దార్ కె.వి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సారా తయారు చేస్తే క్రిమినల్ కేసులు

నందికొట్కూరు: నాటు సారా తయారు చేసినా, విక్రయించినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని టౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్ రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం నీలిషికారిపేటలో నాటు సారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీలిషికారుల్లో కూడా మార్పు రావాలన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల లబ్ధిపొంది నాటు సారా తయారీకి స్వస్తి పలికి సమాజంలో గౌరవంగా జీవనం సాగించాలన్నారు. నాటు సారా విక్రయిస్తున్న దసరా నుంచి 6 లీటర్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

భద్రత కల్పించాలి



కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్య ఘటనను దృష్టిలో ఉంచుకుని అన్ని ప్రభుత్వ వైద్యశాలలో మహిళా డాక్టర్లకు, సిబ్బందికి ప్రభుత్వం భద్రత కల్పించాలి. వైద్యశాలల వద్ద మహిళా పోలీసులతో రక్షణ కల్పించాలి. అత్యవసర వేళల్లో భద్రతా సిబ్బంది అందుబాటులో ఉండేలా, వారి ఫోన్ నంబర్‌లు, ప్రత్యేక వాహనం అందుబాటులో ఉంచాలి. మహిళా వైద్యసిబ్బందికి ప్రత్యేక గదులను కేటాయించాలి. అసాంఘిక శక్తులు ఆస్పత్రిలోకి రాకుండా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నిజమైన రోగులెవరు, బంధువుల ముసుగులో వస్తున్న వారెవరో గుర్తించి ఆకతాయిల నుంచి రక్షణ కల్పించాలి. – డాక్టర్ సాజిదాఫిర్‌దౌస్, అర్బన్ ప్రైమరీ హెల్త్‌సెంటర్, ఆత్మకూరు

కాంపౌండ్ వాల్ ఎ పెంచాలి



కోల్‌కత్తాలోని ఆస్పత్రిలో ట్రైనీ డాక్టరుపై జరిగిన ఘటన దారుణమైనది. రాత్రి వేళల్లో ప్రభుత్వ వైద్యశాల్లో మహిళలకు రక్షణ చాలా అవసరం. ఆకతాయిలు రాత్రి సమయాల్లో వచ్చి ఇబ్బందులకు గురిచేస్తుంటారు. కాంపౌండ్ వాల్ ఎత్తు పెంచాలి. ఆస్పత్రిలో విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాలి. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. రాత్రి వేళ్లలో డాక్టర్లు, నర్సులతోపాటు రోగులు కూడా భయాందోళనకు గురవుతున్నారు. మహిళా డాక్టర్లపై, నర్సులపై, సిబ్బందిపై అనుచితంగా ప్రవర్తించే వారిని కఠినంగా శిక్షించాలి. ప్రాణం పోస్తున్న డాక్టర్లకే ప్రాణ రక్షణ లేకపోతే ఎలా. దోషులకు వేసే శిక్షలను చూసి మరొకరు ఇలాంటి దారుణాలకు పాల్పడటానికి భయపడాలి. – అనురాధ, ఏఎన్‌ఎం, పాములపాడు ప్రభుత్వ వైద్యశాల

ప్రకాశం పంతులు సేవలు మరవలేనివి

● సబ్‌జైల్ సూపరింటెండెంట్ మల్లయ్య



నందికొట్కూరులో మాట్లాడుతున్న సబ్‌జైల్ సూపరింటెండెంట్ మల్లయ్య



కొత్తపల్లిలో టంగుటూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



పాములపాడులో ప్రకాశం పంతులు చిత్రపటం వద్ద నివాళ్లులర్పిస్తున్న సర్పంచు, డాక్టర్

నందికొట్కూరు: ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు అందించిన సేవలు మరవలేనివని సబ్‌జైల్ సూపరింటెండెంట్ మల్లయ్య అన్నారు. శుక్రవారం సబ్‌జైల్‌లో ప్రకాశం పంతులు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సబ్‌జైల్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఖైదీలతోపాటు నేటి యువత ప్రకాశం పంతులు జీవితాన్ని ఆదర్శం తీసుకోవాలన్నారు.

● జూపాడుబంగ్లా: మండలంలోని తూడిచెర్ల గ్రామంలో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని శుక్రవారం నిర్వహించారు. సర్పంచు బాలమద్దిలేటి, నోడల్ ఆఫీసర్ అంబమ్మ, నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షుడు నల్లబోతుల రాముడు తదితరులు టంగుటూరి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు.

● కొత్తపల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఉమారాణి ఆధ్వర్యంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రకాశ పంతులు చిత్రపటానికి సిబ్బందితో కలిసి తహసీల్దార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న, ఆర్ఐ జహంగీర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

● ప్రకాశం పంతులు గొప్ప సంఘసంస్కర్త

పాములపాడు: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు గొప్ప సంఘ సంస్కర్త అని డాక్టర్ సావిత్రి అన్నారు. శుక్రవారం ఆయుర్వేద వైద్యశాలలో సర్పంచు మేకల భాగ్యమ్మతో కలిసి ఆ మహనీయుని జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ కేవలం 14 నెలలు రాష్ట్ర ముఖ్యమంత్రిగా పని చేసిన సమయంలో తిరుపతి వెంకటేశ్వర యూనివర్సిటీ స్థాపించారన్నారు. ప్రకాశం బ్యారేజీని అభివృద్ధి చేశారన్నారు. ఆయనను ప్రతి ఒక్కరూఏ ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

● ఘనంగా ప్రకాశం పంతులు జయంతి

● ఆత్మకూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఆంధ్రకేసరి టంగుటూరు ప్రకాశం పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు. దేశానికి ఆయన చేసిన సేవలను ప్రిన్సిపాల్ పద్మావతి కొనియాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు రామకృష్ణారెడ్డి, తిరుపతమ్మ, కీర్తిచరణ్, రాజకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత ఎంసెట్ కోచింగ్ ప్రారంభం



కోచింగ్ వివరాలను తెలుపుతున్న అధ్యాపకులు

శ్రీశైలంప్రాజెక్ట్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉచిత ఎంసెట్ కోచింగ్‌ను ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ ఆర్. మారెన్న శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ శ్రీశైలం మండలంలోని విద్యార్థులు ఎంసెట్ కోచింగ్ తీసుకోవాలంటే సుదూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. అలాంటి విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని కళాశాలలో ఉచితంగా కోచింగ్ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థి, విద్యాసంస్థల నిర్వాహకుడు మగ్బుల్‌హుస్సేన్, అధ్యాపకులు సూర్యనారాయణ, బాలఎల్లయ్య, డాక్టర్ అబూబకర్, రామచంద్రయ్య పాల్గొన్నారు.

టీబీ, ఎయిడ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న టీబీ సూపర్‌వైజర్ చెరుకు రవికుమార్

ఆత్మకూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో టీబీ, ఎయిడ్స్‌పై శుక్రవారం అవగాహన కల్పించారు. టీబీ సూపర్‌వైజర్ చెరుకు రవికుమార్ మాట్లాడుతూ టీబీ, ఎయిడ్స్‌పై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. క్షయవ్యాధి (టీబీ) లక్షణాలు వివరిస్తూ ఊపిరితిత్తులకేకాకుండా శరీరంలో వెంట్రుకలు, గోర్లకు తప్పా అన్ని భాగాలకు క్షయ వ్యాధి వస్తుందన్నారు. క్షయవ్యాధి పరీక్షలు, మందులు అన్నీ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా లభిస్తున్నాయన్నారు. ఐసీటీసీ సెంటర్ కౌన్సిలర్ ప్రసాద్, సంపూర్ణ సురక్ష కేంద్రం మేనేజర్ జబీఉల్లాహ్ మాట్లాడుతూ సురక్షితం కాని లైంగిక సంబంధాల వల్ల, కలుషితమైన రక్త మార్పిడి, వాడిన సిరంజీలు, బ్లేడ్‌ల వల్ల ఎయిడ్స్ వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రఘురామాచార్యులు, మెరీబా సంస్థ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం

● ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి

ఆత్మకూరు: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే తమ లక్ష్యమని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కరివేన గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో వీధి దీపాలు, తాగుచినీరు, పరిశుభ్రత, రైతన్నలకు గోదాముల ఏర్పాటుకు అత్యంత ప్రాధాన్య ఇస్తూ ముందుకెళ్తున్నామన్నారు. అధికారులు గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలన్నారు. అలాగే మండలంలోన్ని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు సభలు నిర్వహించారు.

● చెంచు గిరిజనులు ఉపాధి పనులు ఫారెస్టులో చేసుకునేవిధంగా చట్టంలో చేర్చాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎం.నరసింహానాయక్, మండల కార్యదర్శి ఎన్.నాగేంద్ర బాబు తదితరులు శుక్రవారం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందించారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న ఎస్ఐ సురేష్‌బాబు

పాములపాడు: వాహన చోదకులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఎస్ఐ సురేష్‌బాబు సూచించారు. శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్ ఆటో డ్రైవర్ల రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదన్నారు. యూనిఫామ్ తప్పనిసరిగా ధరించాలన్నారు. ఇష్టానుసారంగా రోడ్లపై ఆటోలు నిలపరాదన్నారు. డ్రైవర్లు విధిగా ఇన్సూరెన్స్ చెల్లించాలని, లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. మద్యం తాగి వాహనం నడిపినా, అతి వేగంగా వాహనం పడిపినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



●జోరుగా వరి నాట్లు

ఆత్మకూరురూరల్: మండలంలోని సిద్దాపురం చెరువు మినహా అన్ని చెరువులు నిండి అలుగులు పారుతుండడంతో రైతులు వరి నాట్లకు సిద్ధమవుతున్నారు. ఇందిరేశ్వరంలోని మాచా వీరప్ప, పద్మ రాజచెరువుల కింద పొలాలను వరినాట్లకు రైతులు సమాయత్తం చేస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం మహిళా కూలీలు వరి నారు తీస్తూ బిజీగా కనిపించారు.

నష్టపరిహారం ఇవ్వాలి

ఆత్మకూరురూరల్: అడవి పందుల వల్ల మొక్కజొన్న పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేల చొప్పున నష్ట పరిహారం చెల్లించాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు సుధాకర్ నాయకులు శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నల్లకాల్వ గ్రామానికి చెందిన కౌలు రైతులు లచ్చమ్మ, అనురాధ రూ.1,40,000 కౌలు చెల్లించి సాగు చేసిన 4.50 ఎకరాల మొక్కజొన్న పైరును అడవి పందులు తీవ్రంగా నష్టపరిచాయన్నారు. ప్రభుత్వం స్పందించి బాధితు రైతులకు వెంటనే పరిహారం చెల్లించాలని ఆయన కోరారు.

పశువులకు వాక్సినేషన్ తప్పనిసరి



ఎద్దులకు టీకా వేస్తున్న పశువైద్యుడు సాయినాథ్‌రెడ్డి

మిడుతూరు: పశువులకు వాక్సినేషన్ తప్పనిసరి అని పశువైద్యాధికారి డాక్టర్ సాయినాథ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక పశువైద్యశాల ఆవరణంలో పశువులకు టీకాలు వేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు టీకాలు వేయించడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి పెంపొందడంతోపాటు పశువులకు సంక్రమించే రోగాలు అరికట్టేందుకు వీలవుతుందన్నారు. టీకాలు వేయడం ద్వారా జంతువుల నుంచి ప్రజలకు, జంతువుల నుంచి జంతువులకు అంటువ్యాధుల (జునోటిక్ వ్యాధులు) వ్యాప్తిని నిరోధించవచ్చన్నారు. సీజనల్‌లో పశువులకు సంక్రమించే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని రైతులకు సూచించారు.

కొత్త ముచ్చుమర్రిని సందర్శించిన డీఎస్పీ

పగిద్యాల: మండలంలోని కొత్త ముచ్చుమర్రి గ్రామాన్ని ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ శుక్రవారం సందర్శించారు. ప్రజలు శాంతియుత వాతావరణంలో జీవనం సాగించాలని సూచించారు. చట్టవ్యతిరేక చర్యలకు ఎవరూ పాల్పడరాదని, చట్టాన్ని గౌరవించడం పౌరుల కర్తవ్యమని తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే పోలీసులను ఆశ్రయించి పరిష్కరించుకోవాలన్నారు. పిల్లలకు మంచి విద్యాబుద్ధులు నేర్పించడం తల్లిదండ్రుల బాధ్యత అన్నారు. వారి భవిష్యత్‌కు కృషి చేయా లని సూచించారు. ఒంటరి మహిళలను, వితంతువులను, యువతుల వెంట పడి వేధించడం చట్టరీత్యా నేరమన్నారు. డీఎస్పీ వెంట నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రమణ్యం, ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి, ఏఎస్ఐ కృష్ణుడు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

యాదవుల ఆత్మీయ సభకు తరలిరండి

వెలుగోడు: ఈనెల 25న ఆత్మకూరులోని థెరిసా జూనియర్ కాలేజీలో నిర్వహించే యాదవుల ఆత్మీయ సమావేశానికి యాదవులు పెద్ద ఎత్తున తరలి రావాలని అఖిల భారత యాదవ మహాసభ జిల్లా నాయకులు రఘురాముడు యాదవ్ కోరారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ యాదవుల ఐక్యతకు, వారి సమస్యల పరిష్కారం కోసం సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు.

పంట కోతలపై శిక్షణ

పాములపాడు: స్థానిక మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో శుక్రవారం ఏఓ ఫణీశ్వరరెడ్డి, ఏఎస్ఓ విమల, ఉద్యానశాఖాధికారి చందన పంట కోతల ప్రయోగంపై శిక్షణ ఇచ్చారు.

నీటి విడుదల

పాములపాడు: మండలంలోని ఇస్కాల గ్రామంలో ఎత్తిపోతల పథకం నుంచి ఎమ్మెల్యే జయసూర్య శుక్రవారం నీటిని విడుదల చేశారు. మూడు మోటార్ల ద్వారా 31 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇస్కాల ఎత్తిపోతల పథకం పరిధిలో 2,000 ఎకరాలకు సమృద్ధిగా నీరందించడమే లక్ష్యమన్నారు. ప్రతి రైతు మంచి పంటలు పండించి ఆర్థికంగా అభివృద్ధి సాధించాలన్నారు.

ప్రణాళికలతోనే గ్రామాభివృద్ధి



జేసీకి సమస్యలు వివరిస్తున్న ప్రజలు

నంద్యాల(అర్బన్): ప్రణాళికలతోనే గ్రామాభివృద్ధికి సాధ్యమని, గ్రామంలో మౌలిక సదుపాయాలు పెంచుకునేందుకు అందరూ కలిసి కట్టుగా కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ సూచించారు. మహానంది మండలం తిమ్మాపురం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గ్రామ సభకు జేసీ హాజరై మాట్లాడారు. గ్రామ వనరులను సద్వినియోగం చేసుకుంటే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ప్రభుత్వం పంచాయతీలకు పునర్జీవం కలిగించేందుకు కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ శ్రీలక్ష్మి, ఎంపీటీసీ స్వరూపా పాల్గొన్నారు.

బాధితులను ఆదుకోండి



బాధితులకు భోజనం వడ్డిస్తున్న శ్రీశైలం క్షేత్ర పర్యవేక్షణ సమితి సభ్యులు

శ్రీశైలం: ఇటీవల కురిసిన వర్షాలకు సర్వం కోల్పోయిన బాధితులను ఆదుకోవాలని సీపీఎం శ్రీశైలం అధ్యక్షులు ఆరోగ్యం, కార్యదర్శులు ఎం. మల్లికార్జున, వెంకటేష్, జిల్లా కమిటీ సభ్యులు మునిపాటి, చిన్న మరెన్న శుక్రవారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీలతోపాటు కొత్తపేట, శ్రీగిరి కాలనీలలో వర్షపు ముంచెత్తడంతో సర్వం కోల్పోయారన్నారు. శ్రీశైలం పర్యవేక్షణ సమితి ఆధ్వర్యంలో పంపిణీ చేసే సాంబార్, రైస్, ఇతర ఆహార పదార్థాలతో ఆయా కాలనీల ప్రజలు తాత్కాలికంగా కడుపు నింపుకుంటున్నారన్నారు. స్థానిక ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి స్పందించి సమస్యను దేవస్థానం, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి బాధితులకు నష్టపరిహారం అందేలా కృషి చేయాలన్నారు.

జీఆర్‌సీ మానిటరింగ్ బాడీ ఏర్పాటు

నంద్యాల(అర్బన్): జిల్లాకు సంబంధించి గ్రీవెన్స్ రెడ్ రెస్షల్ సెల్ (జీఆర్‌సీ) మానిటరింగ్ బాడీ ఏర్పాటు చేస్తూ కలెక్టర్ కార్యాలయం నుంచి శుక్రవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ అయ్యాయి. జిల్లా స్థాయి శాఖల పర్యవేక్షణ, డివిజనల్ లెవెల్ టీంతో కో ఆర్డినేషన్, మండల, గ్రామస్థాయి అధికారులతో సమీక్షల నిర్వహణ లక్ష్యంగా మానిటరింగ్ బాడీ ఏర్పాటైంది. రెవెన్యూ సదస్సులు, గ్రీవెన్స్‌ల నిర్వహణ కేఆర్‌సీసీ తహసీల్దార్ అంజనాదేవికి, రెవెన్యూ ల్యాండ్ రికార్డ్స్ సీనియర్ అసిస్టెంట్ రమణకు, సర్వే అండ్ సెటిల్‌మెంట్స్ విలేజ్ సర్వేయర్ షేక్ ఫిరోజ్‌బాషాకు, పోలీసుకు సంబంధించి ఎస్ఐ కుమారికి, పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్, ఆల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్స్ డాటా అనలిస్ట్ జీవన్‌కు, ఆల్ ఇంజినీరింగ్ డిపార్టుమెంట్స్ వార్డు సెక్రటరీ అమూల్య ముత్యంకు, ఎడ్యుకేషనల్, మెడికల్ అండ్ హెల్త్, వార్డు ఎడ్యుకేషన్ సెక్రటరీ నాగేశ్వర రెడ్డికి, అగ్రి, ఇండస్ట్రీస్, న్యాచురల్ రీసోర్స్ డిపార్టుమెంట్ వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ వెంకట సుధాకర్‌కు కేటాయించినట్లు సమాచారం.

కౌలు రైతు మృతి



శ్రీనివాసులు(ఫైల్)

దొర్నిపాడు: మండల కేంద్రం దొర్నిపాడుకు చెందిన కౌలు రైతు శ్రీనివాసులు(49) శుక్రవారం పొలం పనులు చేస్తుండగా గుండె పోటుకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. పదేళ్లుగా ఆయన 10 ఎకరాల భూమి కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. అయితే, గత మూడేళ్ల నుంచి పంటలు సరిగా పండకపోవడంతో అప్పుల్లో మునిగిపోయాడు. సుమారు రూ.15 లక్షలకు పైగా ఉన్న అప్పులను ఎలా తీర్చాలని ఆందోళన చెందేవాడు. ఈ క్రమంలో శుక్రవారం వరిపంటకు నీరు కట్టెందుకు వెళ్లగా ఛాతీలో నొప్పి వచ్చి కుప్పకూలిపోయాడు. ఈమేరకు భార్య మహేశ్వరి ఫిర్యాదుతో ఎస్ఐ వెంకటేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నంద్యాల(న్యూటౌన్): మున్సిపల్ ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని ఏపీ ఎంటీఎఫ్ నంద్యాల జిల్లా అధ్యక్షుడు పుల్లయ్యనాయక్, కార్యదర్శి మహేంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఆ సంఘం కార్యాలయంలో కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మునిసిపల్ టీచర్లకు మూడేళ్ల నుంచి పదోన్నతులు చేపట్టలేదని, 5 సంవత్సరాల నుంచి బదిలీలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మున్సిపల్ ఉపాధ్యాయులపై సవతి తల్లి ప్రేమ చూపుతుందని మండిపడ్డారు. సమావేశంలో నాయకులు నాగవెంకటేశ్వర్లు, నాగేశ్వరనాయుడు, జమీల్ అహమ్మద్, గుర్రప్ప, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు సిబ్బంది సమస్యలను పరిష్కరిస్తాం



సిబ్బంది సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా

బొమ్మలసత్రం: పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్‌రాణా అన్నారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్‌డేలో ఆయన మాట్లాడారు. 10 మంది సిబ్బంది వారి సమస్యలపై వినతులు ఇచ్చారన్నారు.

సంపదలను సృష్టించుకోండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయసూర్య

జూపాడుబంగ్లా: గ్రామాల అభివృద్ధికి స్థానిక వనరుల ద్వారా సంపదను సృష్టించుకోవాలని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అధికారులకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని సచివాలయం –2 ఆవరణంలో నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. ఇంటి పన్ను, కుళాయి పన్ను, సంతమార్కెట్, షరాబ్ తదితరు పన్నులతో పాటు వర్మీకంపోస్టు ద్వారా వచ్చిన ఆదాయాలతో గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, ఎంపీపీ సువర్ణమ్మ, సర్పంచు బాలస్వామి, ఎంపీటీసీ వెంకటమ్మ పాల్గొన్నారు.

అందరి సహకారంతో గ్రామాల అభివృద్ధి

నందికొట్కూరు: అందరి సహకారంతో గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని డిప్యూటీ కలెక్టర్ సుధారాణి, స్పెషల్ ఆఫీసర్ శ్రీధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వడ్డేమాన్, అల్లూరు, కోళ్లబావాపురం గ్రామాల్లో జరిగిన గ్రామ సభలను ఉద్దేశించి వారు మాట్లాడారు. మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. ఎంపీడీఓ శోభరాణి పాల్గొన్నారు.

■రాకపోకలు సాగేదెలా?



ఇదేదో ఏ మారుమూల పల్లెటూరి దారి అనుకునేరు. ఆత్మకూరు పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో అధ్వానంగా ఉన్న రహదారి ఇది. అది చేస్తాం ఇది చేస్తామని అధికారం చేపట్టిన కూటమి నేతలు.. రెండు నెలలైనా తట్టెడు మట్టి కూడా వేయడలేదు. దీంతో చిన్న పాటి వర్షం వచ్చిందంటే చాలు కాలనీ వాసులు అడుగు తీసి అడుగు పెట్టేందుకు కూడా ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి కాలనీలో రోడ్డు వేయాలని స్థానికులు కోరుతున్నారు. – ఆత్మకూరు